క్లుప్తంగా

వేర్ హౌసింగ్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా వేణు మాధవరావు



నరసరావుపేటటౌన్: రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ స్టాండింగ్ కౌన్సిల్‌గా పట్టణానికి చెందిన అన్నమరాజు వేణు మాధవరావును నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన రాష్ట్ర హైకోర్టులో వేర్ హౌసింగ్ కార్పొరేషన్ తరుపున మూడు సంవత్సరాలు పాటు న్యాయ సేవలు అందిస్తారు. 1998లో న్యాయ శాస్త్రాన్ని పూర్తి చేసిన వేణు మాధవరావు 1999లో న్యాయవాదిగా బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌లో నమోదయ్యారు. పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది జీఎల్వీ రమణమూర్తి వద్ద వృత్తిలో మెలకువలను నేర్చుకున్నారు. అనంతరం హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వేణుమాధవరావును పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు అభినందించారు.

రైతులు పంట వివరాలు నమోదు చేసుకోవాలి



చిలకలూరిపేట: రైతులందరూ తప్పనిసరిగా తాము సాగు చేస్తున్న పంట వివరాలను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఐ మురళి చెప్పారు. మండలంలోని గోవిందపురం, కమ్మవారిపాలెం గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో నమోదు కావాలని సూచించారు. రిజిస్ట్రేషన్ చేయించుకొని ఫార్మర్ ఐడీ వచ్చిన వారికి మాత్రమే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేయడంతో పాటు పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందని వెల్లడించారు. జిల్లా వనరుల కేంద్రం డీడీఏ ఎం శివకుమారి మాట్లాడుతూ శనగలో కాంప్లెక్స్ ఎరువుల బదులుగా యూరియా, ఎంవోపీ వాడడం వ లన అధిక దిగుబడులతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందని తెలిపారు. అనంతరం రబీలో వేసిన కంది, శనగ పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి టి శ్రీలత, ఏఈవో శ్రీనివాసరావు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

56 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం



నరసరావుపేట: రోడ్డుభద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారము ఆర్టీసీ డిపో ఆవరణలోని మెడికల్ డిస్పెన్సరీలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జిల్లా రవాణా శాఖ (పీటీడీ) అధికారి యస్.శ్రీనివాసరావు ప్రారంభించారు. జిల్లా పరిధిలోని ఆరు డిపోల నుంచి వచ్చిన 56 మంది ఆర్టీసీ ఉద్యోగులు రక్తదానం చేశారు. స్థానిక ఏరియా హాస్పిటల్ డైరక్టరు ఆఫ్ సెకండరీ హెల్త్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ కె.రామేశ్వరి, స్థానిక ఆర్టీసీ డిస్పెన్సరీ మెడికల్ ఆఫీసర్ యస్.నరసింహారెడ్డి పర్యవేక్షించారు. రక్తదానశిబిరం విజయవంతానికి సహకరించిన డిపో మేనేజర్లు, మెడికల్ అధికారులు, ఏరియా హాస్పిటల్, డిస్పెన్సరీ స్టాఫ్, ఉద్యోగులకు డాక్టరు నరసింహారెడ్డి కృతజ్ఞతలు తెలియచేశారు.

భవిత పాఠశాలను పరిశీలించిన ప్యానల్ అడ్వకేట్



రొంపిచర్ల: మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ నరసరావుపేట చైర్మన్ 13వ జిల్లా జడ్జి సత్యశ్రీ ఆదేశాల మేరకు మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలను, భవిత పాఠశాలలను, ప్యానల్ అడ్వకేట్ రామినేని ప్రసాద్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవిత పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. భవితా పాఠశాలలో పిల్లలకు ప్రభుత్వం నుంచి అందుతున్న వినికిడి యంత్రాలు, వీల్ చైర్స్ పరికరాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి పాలు, గుడ్లు, పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల బరువులను తూకం వేసి పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యశాల డాక్టర్ పి. జగన్ నరసింహారెడ్డి, డాక్టర్ ఎస్. సాయిబాబు, మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను (డిఎస్ఎల్‌వో) పల్నాడు జిల్లా సర్వే భూమి రికార్డులు కొలతల అధికారి చేజర్ల భానుకీర్తి బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు రైతుల సమక్షంలో రెవెన్యూ అధికారులు రీసర్వే పనులు చేయాలన్నారు రెవెన్యూ టీమ్స్ ప్రతి రోజు 20 ఎకరాలు తగ్గకుండా భూముల నిజనిర్ధారణ పనులు జరుగుతున్నాయన్నారు.భూములు సర్వే చేస్తున్న రైతులకు నోటీసులు అందజేయాలన్నారు.

అడుగుకో గుంత - తీరదు చింత

- గుంటల రోడ్డుతో కొత్తపల్లి వాసుల అవస్థలు
- వర్షం కురిస్తే గ్రామంతో రవాణ బంద్
- స్వాతంత్ర్యానికి పూర్వ పరిస్థితులు పునరావృతం
- రోడ్డు ఏర్పడి 40 ఏళ్లు, 20 ఏళ్లుగా ఇబ్బందులు



రోడ్డు మధ్యలో భయపెడుతున్న గుంతలు



ధ్వంసమైన రహదారి

రొంపిచర్ల: అదో చిన్న గ్రామం. ఊరు ఏర్పడి 200 ఏళ్లు అవుతుంది. గ్రామంలో పాడిపంటలకు కొదవ లేదు. విద్యార్థులు హైస్కూల్ చదువు వరకు గ్రామంలోనే ఉంది. డాక్టర్‌లకు, ఇంజినీర్లకు కొదవ లేదు. పాడి పంటలకు నిలయం. కరువు, కాటకాలు వచ్చినా ఈ గ్రామంలో పాడి పంటలకు ఎలాంటి తేడా రాదు. ఎక్కువ పక్కా గృహాలు, మేడలే కనిపిస్తాయి. గ్రామంలోని ప్రధాన రోడ్లు పట్టణ వాతావరణం కనిపిస్తుంది. అయితే అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లుగా ఆ ఊరుకి రోడ్డు సౌకర్యం ఉన్నా లేనట్లుగానే భావించే గ్రామమే కొత్తపల్లి గ్రామం.

కొత్తపల్లి గ్రామం జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు 20 కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఈ గ్రామం నుంచి పక్క గ్రామాలకు వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాలకు ప్రయాణించాలన్నా నరసరావుపేట, చేజర్ల ఆర్ అండ్ బీ రహదారికి రెండున్నర కిలోమీటర్లు లింక్ రోడ్డులో ప్రయాణించాలి. ఈ లింక్ రోడ్డు ఏర్పడి 45 సంవత్సరాలు అవుతుంది. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో లింక్ రోడ్డు ఏర్పాటు చేశారు. 25 ఏళ్ల క్రితం ఆ రోడ్డును మెటల్ రోడ్డుగా మార్చారు. మెటల్‌ను 15 సంవత్సరాల క్రితం తారు రోడ్డుగా మార్చారు. అయితే తారు రోడ్డు వేశారు తప్పా ఇంత వరకు ఆ తారు రోడ్డుకు మరమ్మతులు గానీ, పునః నిర్మాణ పనులు గానీ జరగలేదు. ఈ రోడ్డులో మోకాళ్ల లోతు గుంటలు, గొయ్యిల్లో ప్రయాణించాల్సిన దుస్థితి గ్రామస్తులకు ఏర్పడింది. ద్విచక్ర వాహనంపై ఈ గ్రామం వెళ్లి రావాలంటే గ్రామానికి చేరుకునే లోగా, తిరిగి వచ్చే సమయంలోనో తప్పని సరిగా టైర్లు పంచర్లు కాకతప్పదు. చిన్న చిన్న ఖరీదైన కారుల్లో ఈ గ్రామం చేరుకునే వాహనదారుల బాధలు అంతా ఇంతా కాదు. ఈ గ్రామంలోని ఉన్న గ్రామస్తులు బొంబాయి, పూనే, కలకత్తా, హైదరాబాద్, విదేశాల్లో కూడా డాక్టర్‌లుగా, ఇంజినీర్లుగా పనిచేస్తుంటారు. అయితే వారు వేలాది కిలోమీటర్లు పయనించి గ్రామానికి వచ్చినా గ్రామానికి అనుబంధంగా ఉండే రెండున్నర కిలోమీటర్ల రోడ్డులో ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. రోడ్డులో ఏర్పడ్డ గుంతలకు తోడు చిన్న వర్షం వచ్చినా గ్రామం ప్రారంభంలో ఉన్న లోలెవెల్ చప్టాపై నడుముల లోతు వరద నీరు పారుతుంది. ఓ మోస్తరు వర్షాలు కురిస్తే రోజుల తరబడి గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయని వాపోతున్నారు. వెంటనే పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఈ రోడ్డుపై దృష్టి పెట్టి పునః నిర్మాణం చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటోలు కూడా రావండి!

రోడ్డు సౌకర్యం సరిగ్గా లేనందున ఆటోలు గ్రామంలోకి రావటం లేదు. ఉదయం, సాయంత్రం వేళ విద్యార్థులను కాలేజీలకు తీసుకు వెళే బస్సు తప్పా మరే ఏ బస్సులు, ఆటోలు గ్రామంలోకి రావు. పట్టణానికి వెళ్లాలంటే రెండున్న కిలోమీటర్ల మీర నడిచి నర్సమ్మ కుంట వద్దకు వచ్చి ఆటో, బస్సు ఎక్కి ప్రయాణించాల్సి వస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు కావస్తున్నా మా కొత్తపల్లి గ్రామానికి గ్రామానికి రోడ్డు సౌకర్యం అంతంత మాత్రంగానే ఉంది.



రోడ్డు మధ్యలో గుంతలు



గ్రామ ప్రారంభంలో లో లెవల్ చప్టా

రోడ్డు సౌకర్యం ఉన్నా లేనట్లే!



మా గ్రామం ఏర్పడి 200 ఏళ్లు గడుస్తుంది. గ్రామానికి రోడ్డు సౌకర్యం వచ్చి 40 ఏళ్లు అవుతోంది. అయితే పూర్వం మా పెద్దలు 6 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాత మద్రాస్ రోడ్డుకు నడిచి వెళ్లి ప్రయాణించే వాళ్లు. ఇప్పుడైతే మేము రెండున్నర కిలోమీటర్లు నడిచి వెళ్లి ప్రయాణించాల్సి ఉంది. అంతే తేడా. రోడ్డు సరిగ్గా లేనందు వల్ల పూర్వ పరిస్థితులు పునరావృతమయ్యాయి.

– శివరామకృష్ణ, గ్రామస్తుడు

కనమర్లపూడి రైల్వేగేటు ఆర్‌యూబీ పనులు ప్రారంభం



ఆర్‌యూబీ రికార్డును పరిశీలిస్తున్న ఆర్డీవో కె.మధులత

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామ సమీపంలో ఉన్ననటువంటి రైల్వేగేటు 267 మైలు రాయి పరిధిలో ఆర్‌యూబీ నిర్మాణ పనులు ప్రారంభమైనట్లు నరసరావుపేట ఆర్డీవో కె.మధులత తెలిపారు. బుధవారం రెవెన్యూ అధికారులు పనులు జరుగుతున్న ఏరియాను పరిశీలించారు. ఈసందర్భంగా ఆర్డీవో కె.మధులత మాట్లాడుతూ త్వరలో రైల్వేగేటు మూత వేస్తారని, ఈక్రమంలో రైతులు తమ పొలాలకు వెళ్లే విధంగా ఇబ్బందులు లేకుండా ఉండేలా చర్యలు చేపట్టామన్నారు. రీసర్వే పనుల్లో భాగంగా ప్రభుత్వ నిబంధనలు మేరకు డివిజన్ పరిధిలో 7 పైలట్ గ్రామాలను ఎంపిక చేసి రెవెన్యూ అధికారులు పర్యవేక్షణలో రైతుల సమక్షంలో రీసర్వే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు టీమ్స్ ఏర్పడి భూములు ఆధారంగా వాట్సాప్ గ్రూపులు క్రియేట్ చేసి రైతుల సమగ్ర వివరాలు పొందుపరచాలన్నారు. తద్వారా రీసర్వే జరుగుతున్న గ్రామాల్లోని రైతుల్లో మరింత నమ్మకం ఏర్పడి పనులు సులభతరంగా అవుతాయన్నారు. ప్రస్తుతం భూములు విస్తీర్ణం కొలతలు రోవర్ యంత్ర పరికరం ద్వారా పాయింట్లు విధానంలో చేస్తున్నట్లు తెలిపారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే డిప్యూటీ సర్వే అధికారికి తగిన ఆధారాలు అందజేసీ సత్వరమే సమస్య పరిష్కరిస్తామన్నారు. విధుల్లో ఆలసత్వం వహిస్తే, రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆర్‌యూబీ సంబంధించి రికార్డును పరిశీలించారు. తహసీల్దారు కె.సుజాత, డిప్యూటీ సర్వే అధికారి పేరిసోముల నాసరయ్య, సర్వేయర్ రాజు, వీఆర్వో నరసింగరావు, సచివాలయ సర్వేయర్ హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

కార్మికుల ప్రయోజనాలే పరమావధి

ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (1104) ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జీసీహెచ్ కొండలు



ఎస్ఈ విజయ కుమార్‌కు షీల్డు అందజేస్తున్న యూనియన్ నాయకులు

నరసరావుపేట: కార్మికుల ప్రయోజనాలే పరమావధిగా తమ యూనియన్ 75ఏళ్లుగా పనిచేస్తుందని ఏపీ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (1104) ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు జీసీహెచ్ కొండలు పేర్కొన్నారు. బుధవారం యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా బరంపేటలోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో నూతన యూనియన్ జెండా ఆవిష్కరణ మహోత్సవం నిర్వహించారు. అధ్యక్షులు జెండాను, సూపరింటెంటింగ్ ఇంజినీర్ ప్రత్తిపాటి విజయకుమార్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్.రాంబోట్లు, యూనియన్ జిల్లా కార్యదర్శి క్రోసూరి రవిశంకర్, సీనియర్ నాయకులు మంచాల మౌళి, భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఆర్.బంగారయ్య మాట్లాడారు. అసిస్టెంట్ ఇంజినీర్లు, కార్మికులు నాయకులు రవిచంద్ర, రామయ్యలు వైభవంగా నిర్వహించారు.

ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న ఏవీ నాగేశ్వరరావు

వినుకొండ(నూజెండ్ల): కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉద్యోగులకు, కార్మికులకు, కర్షకులకు, అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనాలు చేకూరుస్తామని బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అన్నివర్గాలకు నష్టం కలిగించేలా తీసుకుంటున్న నిర్ణయాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపును కాంక్షిస్తూ ప్రచార నిమిత్తం పల్నాడు జిల్లా వినుకొండ పట్టణంలో స్థూపం సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి 4శాతం మార్జిన్ ఇచ్చేలా ప్రైవేటు కాంట్రాక్టర్ల ద్వారా ఉద్యోగులను నియమించేలా తీసుకున్న నిర్ణయాన్ని తమ జేఏసీ ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని అన్నారు.పీడీఎం ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయనాయక్, యూటీఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేడియోలో కే-రిడ్జి చిన్నారుల ప్రతిభ



ఆకాశవాణి కేంద్రం వద్ద కే-రిడ్జి విద్యార్థులు

నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు తమ విదేశీ భాషల నేర్పరితనాన్ని ఆల్ ఇండియా రేడియో ఆకాశవాణిలో ప్రదర్శించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ బుధవారం తెలిపారు. విజయవాడలోని ఆకాశవాణి కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన రేడియో కార్యక్రమంలో తమ విద్యార్థులు ఫ్రెంచ్, జపనీస్, స్పానిష్, జర్మన్, ఇంగ్లీష్, ఇటాలియన్ భాషలలో కార్యక్రమం నిర్వహించారని వివరించారు. ఆయా భాషలలో పుట్టినరోజు గీతాలు, వర్ణమాలలు, చిన్న సంభాషణలు, వారాలు, నెలలు, పాటలతో అలరించారని తెలిపారు. సుమతీ శతకంలోని వినదగు నెవ్వరు చెప్పిన పద్యాన్ని పలు విదేశీ భాషల్లో వినిపించారన్నారు. దాదాపు 28 నిమిషాల పాటు కొనసాగిన కార్యక్రమంలో 68 అంశాలలో విదేశీ భాషల్లో నిర్వహించారని వివరించారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి కెఎస్. లక్ష్మణరావును గెలిపించాలి



శావల్యాపురంలో ప్రచారంలో పాల్గొన్న నేతలు

శావల్యాపురం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి కె.ఎస్ లక్ష్మణరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని వివిధ ప్రజాసంఘల ఆధ్వర్యంలో విస్తృతస్థాయి ప్రచారం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు బోయపాటి వెంకట రాయుడు మాట్లాడుతూ శావల్యాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ప్రహరీ నిర్మాణం కోసం నిధులు కేటాయించి పదోవ తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటుకు కృషి చేసిన అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్సీ అభ్యర్థి కె.ఎస్.లక్ష్మణరావు విజయానికి ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు. సమాజంలో వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు ఏర్పాటు చేసిన శాసనమండలి రాజకీయ పునరావాస వేదిక కాదని గ్రాడ్యుయేట్లు గ్రహించాలన్నారు. నిరుద్యోగ యువత వంటి వర్గాల సమస్యల గురించి ప్రశ్నించే వారికి మనందరం ఐక్యతగా మద్దతు ఇవ్వాలన్నారు. పాలకవర్గాలను ప్రశ్నించే ప్రజలకు అవసరమైన శాసనాలను రూపొందించటానికి శాసనమండలికి కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలన్నారు. ఆయనతో పాటు శ్రీనివాససింగ్ తదితరులు ఉన్నారు.

22న ప్రతిభా చాలెంజ్ - స్కాలర్‌షిప్ టెస్ట్



కరపత్రాన్ని ఆవిష్కరించిన బాసట సంస్థ నిర్వాహకులు

యడ్లపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద విద్యార్థులకి ఉన్నత విద్యను అందించేందుకు బాసట సామాజిక సాంస్కృతిక వేదిక మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 2024–25 విద్యా సంవత్సరంలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు మాత్రమే 'ప్రతిభా చాలెంజ్ – స్కాలర్‌షిప్ టెస్ట్' నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం యడ్లపాడు పీఆర్ విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించి, పరీక్ష వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతిభావంతులై..ఆర్థికంగా వెనుకబడి ఉన్న విద్యార్థులకు ఈ టెస్ట్ ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించడం లక్ష్యం అని బాసట సంస్థ ప్రతినిధులు తెలిపారు.

పేద కుటుంబాల్లో జన్మించిన ప్రతిభావంతులను ప్రోత్సహించడంతో పాటు, వారి ప్రతిభను వెలుగులోకి తెచ్చేందుకు ఈ స్కాలర్‌షిప్ పరీక్ష ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈనెల 22వ తేదీ శనివారం ఉదయం 10:30 గంటలకు యడ్లపాడు లూథరన్ హైస్కూల్లో పోటీ పరీక్ష జరగనుంది. ఒక గంటపాటు 60 మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నారు. మండల విద్యాశాఖాధికారి ఎంపీ నాగరత్నం, ఎస్ఐ వి.బాలకృష్ణ పరీక్షను అధికారికంగా ప్రారంభిస్తారు. పరీక్షలో గణితం-20, సైన్స్-20, సోషల్-10, ఇంగ్లీష్-10 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. కార్యక్రమంలో బాసట సంస్థ అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని వెంకటేశ్వర్లు, కోశాధికారి కేత రామబ్రహ్మం పాల్గొన్నారు.

ఘనంగా తిరుపతమ్మతల్లి కల్యాణోత్సవం



నరసరావుపేటలో ప్రత్యేక అలంకరణలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు



రొంపిచర్లలో ప్రత్యేక అలంకరణలో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారు

నరసరావుపేట రూరల్: పాలపాడులో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ దేవస్థానం 25 వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త యక్కంటి సుబ్బారెడ్డి, గాదే పెద్దిరెడ్డి, కొలిశెట్టి బాబు, మెట్టు జగన్నాథరెడ్డి, ఎలమంచిలి ధర్మారావు పాల్గొన్నారు.

రొంపిచర్ల : మండల కేంద్రమైన రొంపిచర్లలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి ఆలయ 25వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. తిరుపతమ్మ తల్లిని, గోపయ్య స్వామివారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణ వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పలువురు దంపతులు పీటలమీద కూర్చొని కల్యాణ తంతు కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంతో పాటు, పరిసర గ్రామస్తులు అధిక సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు.

శావల్యాపురం: మండలంలోని కొత్తలూరు గ్రామపంచాయతీ శివారు గ్రామమైన గుర్రంవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం వేడుకలు బుధవారం అత్యంత భక్తిశ్రద్ధలతో భక్తులు నిర్వహించారు. ఈసందర్భంగా గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ అమ్మవారికి ప్రత్యేకంగా పట్టువస్త్రాలు పూలమాలలతో అలంకరణ చేశారు.దేవాలయ ప్రాంగణంలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేకంగా అలంకరణ చేసి వేదపండితులు వేదమంత్రాలు భజంత్రీలు నడుమ దంపతులచే కల్యాణ వేడుకలు వైభవంగా నిర్వహించారు.అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి అన్నదానం ఏర్పాటు చేశారు.

దేవాలయ ఘటనపై ఎస్పీకు ఫిర్యాదు

నరసరావుపేట: మండలంలోని పమిడిమర్రు గ్రామంలో కొందరు వ్యక్తులు సుమారు 120ఏళ్ల క్రితం నిర్మించిన శ్రీ సీతారామస్వామి వారి ఆలయ గాలిగోపురం, ధ్వజస్తంభంలో ప్రతిష్ఠించిన పురాతన కలశాన్ని తస్కరించాలని దురుద్దేశం చేస్తున్నారని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దాసరి వెంకట సత్యనారాణరావు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రూరల్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి సత్యనారాయణరావుకు రసీదు అందజేశారు. ఫిర్యాదు దారు తెలిపిన వివరాల ప్రకారం... తాను పమిడిమర్రు గ్రామంలో నివాసం ఉంటున్నానని, ఈ గ్రామంలో తమ పూర్వీకులు 120 ఏళ్ల క్రితం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానంను నిర్మించి ఉన్నారన్నారు. దానికి తాను వంశపారపర్య ధర్మకర్తనై ఉన్నానన్నారు. ఇదే గ్రామంలో నివాసం ఉండే ఇద్దరు వ్యక్తులు ఈనెల ఎనిమిదిన ఆలయ గాలిగోపురం, ధ్వజస్తంభాలకు ప్రతిష్ఠించిన పురాతన కలశాలకు పరీక్షలు చేశారన్నారు. వీరు ఆ పని చేస్తుండగా దేవాలయం సెక్యూరిటీ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో రికార్డు అయిందన్నారు. దానిని తాను పరిశీలించిన మీదట భవిష్యత్‌లో వీరి నుంచి దేవాలయం, దేవాలయంలో ప్రతిష్ఠించిన విగ్రహాలకు ఎటువంటి హాని కలగకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో తాను ఫిర్యాదు చేస్తున్నట్లు పేర్కొన్నారు. తాను పేర్కొన్న వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయాలని ఆయన కోరారు.

నెలాఖరులోగా వ్యాపారులు లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలి

నరసరావుపేట: పురపాలక సంఘ పరిధిలోని వర్తక, వాణిజ్య వ్యాపారులు ఫిబ్రవరి 28వ తేదీలోగా తమ వ్యాపార లైసెన్స్‌లను తగిన రుసుం చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలా చెల్లించని యెడల మార్చి ఒకటి నుంచి 25 శాతం, ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 50 శాతం ఆలస్య రుసుంను అదనంగా చెల్లించాల్సి వస్తుందన్నారు. అలాగే నూతనంగా వ్యాపారాలు ప్రారంభించిన వారు సమీపంలోని సచివాలయాలను సంప్రదించి లైసెన్స్‌కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రతి రైతు విధిగా గుర్తింపు కార్డు పొందాలి

రొంపిచర్ల: ప్రతి రైతూ విధిగా తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శివలలిత అన్నారు. మండలంలోని సుబ్బయ్యపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతూ తమ దగ్గర్లోని రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నమోదైన రైతుకు 11 అంకెల ఐడీతో గుర్తింపు కార్డు అందజేస్తారన్నారు. గుర్తింపు కార్డు ఉన్న రైతులకే వ్యవసాయ శాఖకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ తదితర పథకాలు వర్తిస్తాయి అన్నారు. పంటలు బీమా, రుణాలు వంటి సౌకర్యాలు కూడా ఈ కార్డు ద్వారానే రైతులకు అందుతాయన్నారు. రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాస్‌బుక్ జిరాక్స్, ఆధార్‌తో లింకు అయిన మొబైల్ నంబర్‌ను రైతు సేవా కేంద్రాల్లో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తెలుసుకోవచ్చు అన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించండి

జిల్లా రవాణా శాఖాధికారి సంజీవ్‌కుమార్



విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న రవాణా శాఖాధికారులు

నరసరావుపేట ఈస్ట్: రహదారి భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించటం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా శాఖాధికారి జి.సంజీవ్‌కుమార్ తెలిపారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలలో ఎందరో ప్రాణాలను కోల్పోవడంతో పాటు అంతకు రెట్టింపు సంఖ్యలో క్షతగాత్రులవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి భద్రతా నియమాలను పాటించకపోవటం వల్లనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈసందర్బంగా భద్రతా నియమాలను పాటిస్తామని విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, ఎంవీఐ ఎస్.శివనాగేశ్వరరావు, రక్షణ ఫౌండేషన్ డైరెక్టర్ జి.విజయపాల్ రెడ్డి, డాక్టర్ నవ్య, వైస్‌ప్రిన్సిపల్ ఎంఆర్‌కె సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.